క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

హాలియా : మండలంలో నూతనంగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా సాయం కోసం ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు అకౌంట్ మార్చాలనుకున్నా అవకాశం ఉందన్నారు. ఆయా గ్రామాల క్లస్టర్ ఏఈఓలను రైతులు సంప్రదించి నూతన పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకం అయినా జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జీరాక్స్, పూర్తిగా నింపిబడిన దరఖాస్తు ఫారంతో ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారులకు ఆర్థిక సాయం అందజేత

మాడుగులపల్లి : మండలంలోని పాముల పాడు గ్రామానికి చెందిన తాటి వసంత, క్రాంతికుమార్‌లు మృతిచెందారు. దీంతో వారి పిల్లలు నిశ్విక, వర్షిత్‌లు అమ్మమ్మ సంరక్షణలో ఉంటున్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో మాజీ సర్పంచ్ యాతం లక్ష్మీనరేందర్‌రెడ్డి ఆ చిన్నారులకు చదువు నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌నూ చిన్నారులకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ పనులు చేస్తున్నందున నేడు 132కేవీ మాడుగులపల్లి పరిధిలోని మాడుగులపల్లి, చెరువుపల్లి, ఆగామోత్కూర్, సీత్యాతండా, పాములపాడు, ఇందుగుల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ ఎ.మణిదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గాజీనగర్ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని సోమవారం మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్యమాదిగ అధ్యక్షతన ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పేట రమేష్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పేట శ్రీనుమాదిగ, ఉపాధ్యక్షులుగా ఆశపాక ఊషయ్యమాదిగ, సహాయ కార్యదర్శిగా పేట బాలకృష్ణ, కోశాధికారిగా పేట లక్ష్మయ్య, పేట చిన్న కృష్ణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు పోలేని యాదయ్య, గడ్డం శ్రీరాములుమాదిగ, ఇద్దయ్యమాదిగ, నాగ, గోపి, మహేస్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమాజ్ మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు

పెద్దవూర : బీసీ సమాజ్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తెప్పలమడుగు గ్రామానికి చెందిన పల్లెబోయిన ఆంజనేయులు యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు బీసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి చంద్రశేఖర్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థిరత్వం పొందటమే బీసీ సమాజ్ లక్ష్యమన్నారు. బీసీల హక్కుల కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టిమళ్ల సరేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరుడికి నివాళి



చెన్నకేశవులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది

నిడమనూరు : మండలకేంద్రానికి చెందిన పోలీస్ అమరుడు వున్నం చెన్నకేశవుల వర్ధంతి సందర్భంగా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. స్టేషన్ ప్రాంగణంలో చెన్నకేశవులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెన్నకేశవులు 23 జూన్ 2003న మేళ్లచెర్వు మండలం నెమలిపురి సమీపంలో పోలీస్ కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సల్స్ అమర్చిన మందుపాతరకు అమరుడయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జోజి, ఏజీపీ వున్నం చినవీరయ్య, ఈశ్వర్, ఉషాకిరణ్, బొల్లం శ్రీనివాస్, వినీల్‌రెడ్డి, పీడీ షహీద్, భాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన ఆర్టీసీ బస్‌పాస్‌ల చార్జీలు వెంటనే తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే విద్యార్థులకు ఇవ్వాల్సిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో ఇద్ది రాములు, రాకేష్, చరణ్, అనూష ఉన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- గ్రామాల వారీగా మొక్కల పెంపకం
- మొక్కలు నాటే ప్రాంతాల గుర్తింపు



పెద్దవూర వన నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

పెద్దవూర : గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం తెలంగాణకు హరిత హారం కార్యక్రమం కింద విరివిగా మొక్కలు నాటింది. గతేడాది నుంచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారం పేరుమార్చి వనమహోత్సవం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ ఏడాది త్వరగా నైరుతి రుతుపవనాలు రావడంతో ముందస్తుగా కురుస్తున్న వర్షాలతో వనమహోత్సవం కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలనే దిశగా కార్యదర్శులు ఇప్పటికే ఉపాధిహామీ సిబ్బందితో సమాలోచనలు చేస్తున్నారు. మొక్కలు అయితే నాటుతున్నారు కాని వాటి సంరక్షణకు సరైన చర్యలు చేపట్టకపోవడంతో నాటిన మొక్కల్లో చాలా వరకు బతకడం లేదు

15 రకాల మొక్కల పెంపకం

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీలకు గాను మొత్తం 57 ఆవాస గ్రామాలు ఉన్నాయి. 2025–26 సంవత్సరం వన మహోత్సవంలో భాగంగా మండలంలో మొత్తం 61620 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని వన నర్సరీలలో పండ్లు, పూలు, నీడనిచ్చే త1,20,410 మొక్కలను పెంచుతున్నారు. ప్రధానంగా జామ, నిమ్మ, బొప్పాయి, మునగ, కరివేపాకు, కానుగ, సిల్వోమాం, చింత, ఉసిరి, వేప, గుల్మోరు, చీమతంగెడు, చీమ చింత, కాగితపు పూలు, మందార, గోరింటాకు వంటి 15కు పైగా రకాల మొక్కలను పెంచుతున్నారు.

గ్రామాల వారీగా..

ఆయా గ్రామ పంచాయతీలతో పాటు ఆవాస గ్రామాల్లోనూ విరివిగా మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గ్రామ విస్తీర్ణం, జనాభాను బట్టి మొక్కలను పెంచాల్సి ఉంటుంది. ఈ మొక్కలను ప్రభుత్వ భూములు, అటవీ భూములు, సంఘం భవనాలు, రహదారికి ఇరువైపులా, పొలం, కాలువ గట్లపైన, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాలలో నాటించాలి. నాటిన మొక్కలలో 85 శాతం బతికేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా భావించాలి



ఒక్కో గ్రామంలో వెయ్యి నుంచి ఐదు వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించాం. వర్షాలు పడగానే వన మహోత్సం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. మొక్కలకు నిత్యం నీరు పోసి, అవి చనిపోకుండా చర్యలు తీసుకోవాలి. వాటికి రక్షణగా కంచెలను ఏర్పాటు చేయాలి. అలాగే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి.

– మానె ఉమాదేవి, ఎంపీడీఓ, పెద్దవూర

మొక్కలు తొలగిస్తే కేసులే..

ప్రతి కుటుంబం విధిగా మొక్కలు నాటేలా చూస్తున్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను ఎవరైనా తొలగిస్తే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు కానున్నాయి. గ్రామంలో గాని, రహదారికి ఇరువైపులా, వ్యవసాయ భూముల్లో, ఇతర ఎక్కడైనా నాటిన మొక్కలను తొలగించినా, కాల్చివేసినా, పీకి పడేసినా అలాంటి వారిపై చర్యలు తప్పవు. నాటిన మొక్కల్లో 85 శాతం మొక్కలు బతికేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గ్రామాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యవేక్షించి, వాటి రక్షణ చర్యలు తీసుకోనున్నారు.

తొలి, మలిదశ ఉద్యమనేత కేశవరావ్ జాదవ్



కేశవరావ్ జాదవ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న విద్యావంతుల వేదిక నాయకులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ అస్తిత్వాన్ని నలుదిశలా భావజాల వ్యాప్తి చేసిన తొలి, మలితరం ఉద్యమకారుడు కేశవరావ్ జాదవ్ అని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు విద్యా వంతుల వేదిక నేతలు, ప్రజా సంఘాల నేతలు అన్నారు. సోమవారం పట్టణంలో కేశవరావ్ జాదవ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమనేత కేశవరావ్ జాదవ్ తెలంగాణ సాయుధ పోరాట కాలంలో పీడిత ప్రజల హక్కుల కోసం గొంతెత్తాడని, ముల్కి ఉద్యమంలో తెలంగాణకు దక్కాల్సిన ఉద్యోగాల కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌తో కలిసి పోరుబాట పట్టారన్నారు. పౌర హక్కుల కోసం పోరాటాన్ని నిర్వహించారని, పాలమూరు జిల్లాలో కరువు కరాళ నృత్యం చేస్తుంటే అంబలి కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చిన మానవతావాది జాదవ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక, నేతలు, ప్రజా సంఘాల నేతలు నారాయణరెడ్డి, డేగ వీటి, బీసం రామయ్య, శర్మన్న, కలిమెల నాగయ్య, భిక్షమయ్య, సుదర్శన్, మనోజ్, గురువయ్య రాజు, రవి, హరిలతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదానాయక్ అన్నారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ మేరకు మిర్యాలగూడ ఎంఈఓ బాలునాయక్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలు వేలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తూ ప్రజలను పేదరికంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నో, ఐఐటీ వంటి ఆదర్శనీయమైన పేర్లతో.. పుస్తకాలు, యూనిఫాంలకు వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాధికారులు ఇప్పటికైనా అనుమతిలేని పాఠశాలలను మూసి వేయాలని లేకుంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు జగన్‌నాయక్, నాయకులు సంపత్, రాగ్య, కిరణ్, వెంకటేశ్, రఘు, మనీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



చింతపల్లి : విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి : మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ మాట్లాడుతూ మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా లోపాలు అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉన్నట్టు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రత్యేకమైన ఫీడర్ లేకపోవడం వలన నిరంతరం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో ముందస్తు సూచనలు లేకుండా గంటల తరబడి విద్యుత్ అంతరాయం ఏర్పరడంతో ప్రజలు వ్యాపారస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంబంధిత లైన్‌మెన్, సహా లైన్‌మెన్లు, అందుబాటులో లేకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు, రైతులు సకాలంలో విద్యుత్ సరఫరా లేక పంట నష్టం వాటిల్లుతున్నట్లు తెలిపారు. తక్షణమే విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అటు రైతులకు ఇటు ప్రజలకు సకాలంలో విద్యుత్ లోపాలు లేకుండా చూడాలన్నారు. మండల కేంద్రంలో ప్రత్యేక పీడర్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, పార్టీ సీనియర్ నాయకులు కుకుడపు రామకృష్ణ మండల ప్రధాన కార్యదర్శి వెన్నం శేఖర్, బొడ్డు మహేష్ గౌడ్, బూత్ అధ్యక్షులు గజ్జి అభినవ్, సీనియర్ నాయకులు నాళ్లల శివకుమార్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఉప్పరమోని కిరణ్, కోడీదల శ్రీనివాస్, గుండ్లపల్లి లక్ష్మణ్, బినమోని భిక్షం, కుందేళ్ల శ్రీశైలం, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

మిర్యాలగూడ అర్బన్ : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లలో వచ్చే అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేసి సైబర్ నేరస్తుల ఒలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షీ టీం ఏఎస్ఐ తబిత అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతు వేదిక వద్ద రైతులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కొందరు వ్యక్తులు ఫోన్‌లు చేసి రైతు భరోసా, రుణమాఫీ జరిగిందా..? లేదా..? అని అడిగి బ్యాంకు ఖాతా నంబర్లను అడుగుతారని అలాంటి వారికి బ్యాంక్ అకౌంట్ వివరాలు కాని.. ఓటీపీలు కాని చెప్పొద్దని సూచించారు. బ్యాంకు అకౌంట్ గురించి ఏమైనా సందేహాలుంటే నేరుగా బ్యాంకు వారిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు రవీందర్ తదితరులున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలే : ఎస్ఐ

మిర్యాలగూడ టౌన్ : మైనర్లకు వాహనాలు ఇస్తే తండ్రులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య, రూరల్–2 ఎస్ఐ సైదులు హెచ్చరించారు. సోమవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌లో గల కెఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం కళాకారులు మత్తు వలన జరిగే అనార్థాలు, రోడ్డు ప్రమాదాలపై కళారూపాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

త్రిపురారం : తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెన్నాయిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ ఉమ్మడి సైదిరెడ్డి, సహాయ కో.ఆర్డినేటర్ మాలోతు దశరథనాయక్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9849573645, 8555917912 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

త్రిపురారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన త్రిపురారం మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రైతు రేపాల సైదిరెడ్డి గేదెలను మేత కోసం సమీపంలో ఉన్న పొలాలకు తోలుకెళ్లారు. గేదెలు మేత మేసుకుంటు వ్యవసాయ పొలాలకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఉన్న స్తంభం వైపు వెళ్లింది. కరెంటు తీగ తెగి ఉండడంతో విద్యుత్ సరఫరా అవుతుండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందినట్లు తెలిపారు. గేదె మృతి చెందిన ప్రాంతాన్ని త్రిపురారం మండల విద్యుత్ అధికారులు పంచనామా నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు



కిట్లను పరిశీలిస్తున్న సీడీపీఓ మమత

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన మెడికల్ కిట్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో మున్సిపాలిటీలో 100 అంగన్‌వాడీ కేంద్రాలు కాగా మిర్యాలగూడ మండలంలో 111 కేంద్రాలున్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాలకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా సరఫరా చేసిన మెడికల్ కిట్లు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేయనున్నారు. ఈనెల 6వ తేది నుంచి అమ్మబాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పిల్లలను చేర్చుకునేందుకు ప్రణాళిక ద్వారా సిద్ధం చేశారు. ఈ మెడికల్ కిట్లలను ప్రాజెక్టు సీడీపీఓ రేఖల మమత పరిశీలించారరు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే ప్రాజెక్టు సమావేశాన్ని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ మెడికల్ కిట్లును అందజేస్తామన్నారు. ఆమె వెంట పోషన్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నాగార్జునసాగర్ : జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న దేశవ్యాప్తంగా తల పెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, సీఐటీయూ నల్లగొండ జిల్లానాయకులు ఎస్.కె.బషీర్ పిలుపునిచ్చారు. సోమవారం నందికొండ మున్సిపాలిటీ కార్మికులతో సమావేశం నిర్వహించారు కార్మికులకు కవచ కుండలాల వలే ఉన్న 34కార్మిక చట్టాలను తొలగించి, దేశవ్యాప్తంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని కేంద్రం చూస్తుందన్నారు. అధ్యక్షుడిగా శివ,ఉపాధ్యక్షులుగా నాగ భాస్కర్, కార్యదర్శిగా తాహేర్, మహిళా ఉపాధ్యక్షురాలుగా బాలమ్మ, సహాయ కార్యదర్శులుగా వెంకట్‌రెడ్డి, మణి తదితరులను ఎన్నుకున్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

డిండి : మండల కేంద్రంలో ఇరిగేషన్ శాఖ పేరు మీదకు మారిన వ్యవసాయ భూములను తిరిగి రైతులకు పట్టా పాసు పుస్తకాలు ఇప్పించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ముస్తఫాకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ డిండి గ్రామపంచాయతీ పరిధిలోని రైతులకు సంబంధించి వారసత్వంగా వస్తున్న దాదాపు 450ఎకరాలు ఎలాంటి కారణం చూపకుండా 2009లో అప్పటి జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇరిగేషన్ శాఖ పేరు మీదకు మారాయన్నారు. అప్పటి నుంచి ఆ భూములు తిరిగి రైతుల పేరిట మార్చాలని ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో రైతులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, ఐలేష్‌చారి, శేఖర్‌రెడ్డి, గెల్వయ్య, కిషన్, చంద్రయ్య, విమలమ్మ, పుష్పమ్మ, మేఘమాల, లింగమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

రైతు నేస్తం.. మరింత చేరువగా



మిర్యాలగూడ : దామరచర్ల రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు



నిడమనూరు : రైతునేస్తం కార్యక్రమంలో తహసీల్దార్, రైతులు

హాలియా : రైతు నేస్తం కార్యక్రమాన్ని మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లో రైతు నేస్తం రైతులతో ముఖాముఖి టెలికాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సోమవారం అనుముల మండలంలోని కొత్తపల్లి, ముక్కమాల రైతు వేదికల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సరిత, తహసిల్దార్ రఘు, ఎంపీడీఓ సుజాత, ఉద్యానశాఖ అధికారి మురళి, ఏఈఓలు, రైతులు తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులు పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త కొండ లక్ష్మణ్‌గౌడ్, ఏఈఓ ప్రియాంక, గాదె పెద్దహనిమిరెడ్డి, ఇటూరి వెంకట్‌రెడ్డి, చల్లా వెంకట్‌రెడ్డి, మాదిరెడ్డి సత్యంరెడ్డి, ఆంగోతు మేగ్యానాయక్, ఆంగోతు సైదానాయక్, నన్నెబోయిన లింగయ్య, కొప్పుల పిచ్చిరెడ్డి, దుర్గంపూడి తిరుపతిరెడ్డి, రామయ్య, జానునాయక్, రమావత్ వెంకటేశ్వర్లు, బాలు, వెంకన్న, పాల్గొన్నారు.

నిడమనూరు : సాగులో సులభమైన పద్ధతులు, నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం నూతనంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమం నిడమనూరు, ఊట్కూర్, తుమ్మడం రైతువేదికల్లో నిర్వహించారు. రైతు వేదికలలో ముఖ్యమంత్రి ప్రారంభ కార్యక్రమంతోపాటు, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు, సాగు సమస్యలు, వాటి నివారణపై పలు అంశాలపై చర్చించుకున్నారు. నిడమనూరులో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏఈ ఓ సతీష్‌చంద్ర, క్రాంతి, ఊట్కూర్‌లో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏవో మునికృష్ణయ్య, తుమ్మడంలో ఎంపీడీఓ గుర్రం వెంకటేశ్వర్లు, ఏఈఓ తనూజ, అభ్యుదయ రైతులు ఉన్నం సత్యనారాయణ, చెర్క శ్రీను, పాల్గొన్నారు.

కిటకిటలాడిన రైతు వేదిక

అడవిదేవులపల్లి : రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంతో పాటు ములకచర్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ టి. వెంకటేశం, తహసీల్దార్ రాగ్యానాయక్, ఎంపీడీఓ మాతంగి రమేష్, మండల వ్యవసాయ అధికారిని గుర్రం సరిత, ఏఈఓలు లావణ్య, నరేష్ ఉన్నారు.

కొండమల్లేపల్లి : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వానకాలం పంటకు సంబంధించి రైతు భరోసా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ని వీక్షించిన వారిలో ఏఓ జానకిరాములు, ఏఈఓ మహేష్, సురేష్, రైతులు పాల్గొన్నారు.

చందంపేట : చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చందంపేట మండలంలోని పోలేపల్లి రైతు వేదికలో, అలాగే నేరెడుగొమ్ము మండల కేంద్రంలో రైతు వేదికలో రైతులు పాల్గొని సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొండ్ర శ్రీశైలంయాదవ్, ఏవోలు లక్పతి, యాదగిరి, ఎంపీడీఓ లక్ష్మి, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి రైతు వేదికలో..

శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి

పెద్దవూర: వ్యవసాయంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, హౌజింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎస్‌పీ రాజ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని పెద్దవూర, పర్వేదుల, రైతు వేదికలలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ జె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఉమాదేవి, ఏఓ సందీప్‌కుమార్, ఏఈవోలు ఆంజనేయులు, స్వాతి, నరేష్, మధుకర్, దేవా పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా బిక్షంరెడ్డి



పెద్దవూర : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మండల కార్యదర్శిగా మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన గడ్డంపల్లి బిక్షంరెడ్డి వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండలంలోని పులిచర్ల గ్రామంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శిగా పోతునూరు గ్రామానికి చెందిన రొయ్య రాములు ఎన్నికయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి సర్వే

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలోని సర్వే నంబర్ 86లోని ప్రభుత్వ భూమిలో ఎంజాయ్‌మెంట్ సర్వేను అధికారులు సోమవారం నిర్వహించారు. పెండ్లిపాకల రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న రైతులకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ, ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం ఈ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ శ్రీను, ఎస్ఐ అజ్మీర రమేష్, సర్వేయర్ విజయలక్ష్మీ,ఇబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తిరుమలగిరి (నాగార్జునసాగర్): విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని చెంచోనితండాలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది మొదటిసారిగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఆయన అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సుహాసిని, సీఆర్‌పీ రంగస్వామి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు సోమవారం 'హలో విద్యార్థి చలోబడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అప్పం వీరయ్య, వెంకటేష్, మోహన్, బాబా, లక్ష్మణ్, తదితరులున్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

హాలియా : మండలంలోని మారేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట –అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం చిన్నారులకు సామూహిత అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉదయశ్రీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని సౌకర్యాలతో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో బోధన చేయనున్నట్లు తెలిపారు. మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్ శిరీష, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెద్దవూరలో తిరంగా ర్యాలీ



పెద్దవూరలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దవూర : ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో భారత సైన్యానికి మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని కోదాడ –జడ్చర్ల జాతీయ రహదారిపై తిరంగా యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి మాట్లాడుతూ పహల్గాం దాడికి ప్రతిచర్యగా పాకిస్థాన్‌పై యుద్ధం చేసి కేవలం నాలుగు రోజుల్లో చేయాల్సిందల్లా చేసి పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చేలా చేసిందన్నారు. త్రివిధ దళాల ధైర్య సాహసాలకు ప్రతి ఒక్కరూ సలాం కొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్తీ శంకర్‌నాయక్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, కంభంపాటి కృష్ణ, చిట్టిమల్ల సరేష్, ఆంజనేయులు, కుంటిగొర్ల రాజశేఖర్, పెద్దయ్య, సుమన్‌నాయక్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.